క్లుప్తంగా

స్వార్థ రాజకీయాలను ఓడించండి


మాట్లాడుతున్న సంతోష్

మంథని: నియోజకవర్గంలో ప్రతిపక్ష, అధికార పార్టీలు కుల రాజకీయాలు చేస్తున్నాయని,విలువలు కోల్పోయి విధగం విమర్శలు చేసుకుంటున్నాయని లేబర్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇరుగురాల సంతోష్ అన్నారు. సోమవారం మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో సమావే శం నిర్వహించి మాట్లాడారు. వరదలతో నష్టపోయిన భాధితులకు పైసా పరిహారం ఇప్పించలేదన్నారు. రాబోయో ఎన్నికల్లో ఓటును సరైన మార్గంలో ఉపయోగించుకోవాలన్నారు. లేబర్ పార్టీని ఆదరించాలని కోరారు.

రెండు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో రెండు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక కమిషనర్ బి.సుమన్‌రావు తెలిపారు. అంతర్గత పైప్ లైన్ల అనుసంధానం పనులు చేపడుతుండడంతో రమేష్‌నగర్‌లోని మెటర్నిటీ హాస్పిటల్ వాటర్‌ట్యాంక్ పరిధిలో మంగళ, బుధవారాల్లో నీటిసరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు ప్రజలు నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని కమిషనర్ కోరారు.

ఉచిత వైద్యశిబిరం


మందులు రాస్తున్న వైద్యుడు

మంథని: మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గద్దలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంతో పాటు ఇతర వైద్యులు, సిబ్బంది సేవలందించారు. వైద్యులు శంకరాదేవి, సృజన్, కిరణ్‌కుమార్, సర్పంచ్ నరేశ్‌రావు ఉన్నారు.

బస్‌పాస్‌లు పంపిణీ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని రత్నాపూర్ గ్రామంలో వికలాంగులకు బస్‌పాసులను సర్పంచ్ పల్లె ప్రతిమ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పలువురు బస్‌పాసుల కోసం దరఖాస్తు చేసుకోగా 43 మందికి పాస్‌లు మంజూరైనట్లు సర్పంచ్ తెలిపారు. బస్‌పాస్ కోఆర్డినేటర్ బొబ్బిలి రాజేశ్, పంచాయతీ కార్యదర్శి రమ్య, నాయకులు పీవీ.రావు, రవీందర్‌రావు, అంజయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

ముగిసిన కంటివెలుగు

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్లలోకొన్నిరోజులుగా నిర్వహిస్తున్న 'కంటివెలుగు' రెండోవిడత కార్యక్రమం సోమవారంతో ముగిసింది. సర్పంచ్ పద్మ'కంటివెలుగు' వైద్య సిబ్బందిని సన్మానించారు. ఉపసర్పంచ్ కనుకయ్య,కార్యదర్శి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ

పాలకుర్తి: మండలంలోని బసంతనగర్ కేశోరాం వర్కర్స్ క్లబ్‌లో సీపీఆర్‌పై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. వైద్యులు సరళ, హరిత, సాయిసూర్య పాల్గొని ఆశావ ర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఇతర సిబ్బందికి సీపీఆర్ విధానంతో గుండెపోటుకు గురైన వ్యక్తులను కాపాడే అంశంపై వివరించారు. ఎంపీపీ అనసూర్య, ఎంపీడీవో లలిత, ఎంపివో షబ్బీర్‌పాషా పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

జూలపల్లి: మండల కేంద్రంలో మొక్కజొన్న పశుగ్రాసం దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. జూలపల్లి మండల కేంద్రానికి చెందిన రైతులు నాడెం మల్లారెడ్డి, కల్లెం దామోదర్‌రెడ్డిలకు చెందిన భూమిలోని మొక్కజొన్న పశుగ్రాసానికి సోమవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని, పూర్తిగా దగ్ధమైంది. పంటలకు బావి నీరందించేందుకు ఉపయోగించే పైపులు కాలిపోయాయి. స్థానిక పోలీసులు చొప్పదండి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వచ్చి, మంటలు ఆర్పివేశారు. రైతులకు దాదాపు రూ.12వేల నష్టం జరిగిందని తెలిపారు.

వేంనూర్‌లో పట్టపగలు చోరీ

పాలకుర్తి: మండలంలోని వేంనూర్ గ్రామంలో సోమవారం పట్టపగలు చోరీ జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కన్నం (మేర్గు) లక్ష్మయ్య సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి. పక్క గ్రామమైన కుక్కలగూడుర్‌లో జరిగిన ఓ శుభకార్యానికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో దుండగులు తాళాలు పగులగొట్టి, ఇంట్లోకి చొరబడి, రూ.50 వేలతోపాటు రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లారు. సాయంత్రం వచ్చిన లక్ష్మయ్య ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించి, చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. బసంత్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మనఊరు మనబడి

పనులపై పట్టింపేది?

- జూన్ 12 నుంచి పాఠశాలల పునః ప్రారంభం
- పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లు
- నత్తనడకన సాగుతున్న పనులు

కమాన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలలను అన్నివిధాల అభివృద్ధి చేసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీసుకురావాలని గతేడాది ప్రభుత్వం మనఊరు మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలను గుర్తించి అన్నిసౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేసింది. ఇప్పటి వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనులు పూర్తికాగా జిల్లా పరిషత్ పాఠశాలల్లో చేపట్టిన పనులు పూర్తికాలేదు. వేసవి సెలవుల అనంతరం ఈ విద్యాసంవత్సరం జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.


కల్వచర్లలో పనులు పూర్తి కానీ తరగతి గదులు

కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో..

కమాన్‌పూర్, రామగిరి మండలాల్లోని కమాన్‌పూర్, రొంపికుంట జిల్లా పరిషత్‌లతో పాటు, గుండారం, కమాన్‌పూర్, రొంపికుంట ప్రాథమిక పాఠశాలలు, ఉర్దూమీడియం ప్రాథమిక పాఠశాలతో పాటు డైనింగ్‌హాల్, రామగిరి మండలంలోని కల్వచర్ల, నాగేపల్లి బేగంపేట, చందనాపూర్, సుందిల్లా జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, డైనింగ్‌హాల్ పనులు చేపట్టేందుకు అధికారులు ఎంపికచేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నథ పాఠశాలల్లో పనులు పూర్తిచేసి పలు పాఠశాలలను ప్రారంభించారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో చేపట్టి పనులు నత్తనడకన సాగుతున్నాయి.


నాగేపల్లిలో ఫిల్లర్ల వద్ద నిలిచిన డైనింగ్ హాల్ పనులు

జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం

ఈ ఏడాది విద్యాసంవత్సరాన్ని ప్రభుత్వం జూన్ 12 నుంచి ప్రారంభించాలని ప్రభుత్వం ఉత్తర్వూలు జారీచేసింది. జూన్ 2 నుంచి గ్రామాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నారు. పాఠశాలల్లో పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించడానికి ఆసక్తి చూపుతారోలేదో వేచి చూడాల్సిందే..

ఇబ్బందులు పడాల్సిందేనా..

మనఊరు మనబడి కార్యక్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఇబ్బంది పడాల్సిందేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు కూర్చునేందుకు గదులు,తాగునీరు, మూత్రశాలల సౌకర్యాలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడునున్నారు.

చర్యలు తీసుకుంటాం



కమాన్‌పూర్, రామగిరి మండలాల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి మన ఊరు మనబడిలో పలు పాఠశాలలను ఎంపిక చేశాం. ఇప్పటికే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దాదాపు పనులు పూర్తిచేశాం. జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనులు పూర్తి కాలేదు. కొన్నిరోజుల్లో పనులు పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– పల్లెపాటి సంపత్‌రావు, ఎంఈవో

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


పరామర్శిస్తున్న శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మజీద్‌ఖాన్ రెండు రోజుల క్రితం మృతిచెందగా మజీద్‌ఖాన్ కుటుంబ సభ్యులను సోమవారం ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించి సానుభూతి తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన అంబలి కేంద్రాన్ని సందర్శించి అంబలి పంపిణీ చేశారు. ఛత్రపతి శివాజీ యువసేన చేపట్టే కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమాన్‌పూర్, రామగిరి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, తోట చంద్రయ్య, సర్పంచ్‌లు ఆకుల ఓదెలు, కట్కం రవీందర్, ఎంపీటీసీ శేవ్వ శంకరయ్య, నాయకులు తొగరి అశోక్, గుమ్మడి సతీశ్, శ్రీనివాస్, కుందారపు బాపు, కోల నర్సగౌడ్, ముదాం కొమురయ్య తదితరులున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ నాయకులు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం సానుకూలంగానే ఉందని, వీలైనంత త్వరలోనే స్థలాలను కేటాయించేలా చూస్తామన్నారని నాయకులు పోగుల విజయ్‌కుమార్, మహేశ్, భిక్షపతి, సుదర్శన్, తిరుపతిరెడ్డి, పరమేశ్, వినోద్, మొహిద్ తెలిపారు.

కార్మికులకు షూ, యూనిఫాం ఇవ్వాలి


వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పర్మినెంట్ కార్మికులకు షూ, యూనిఫాంతో పాటు ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఇవ్వాలని పర్మినెంట్ కార్మికసంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి కోరారు. సోమవారం సూపర్‌బజార్‌లోని యూనియన్ కార్యాలయంలో యూనియన్ మొదటి కార్యవర్గ సమావేశంలో కార్మికుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలుచేశారు. అనంతరం కార్మికుల సమస్యలపై కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ గోవిందరావుతో చర్చలు జరిపి వినతిపత్రం అందించారు. యూనియన్ అభ్యర్థన మేరకు కార్మికులకు షూ, యూనిఫాం త్వరలోనే అందిస్తామని అధికారులు తెలిపినట్లు నాయకులు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేణి శ్రీనివాస్, ఐఆర్ అధికారి వెంకటేశ్వర్లు, యూనియన్ కార్యవర్గ సభ్యులు పోతుల ప్రసాద్, మోహన్, విశ్వనాథం, ఈదునూరి నారాయణ, రాజేశం, కోరెపు రవీందర్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు


ఓదెల, పెగడపల్లె మధ్య నిర్మించిన తారురోడ్డు

ఓదెల: మండలకేంద్రం నుంచి లంబాడితండా, నాంసానిపల్లె , పెగడపల్లె మీదుగా కొలనూర్ వరకు తారురోడ్డు పూర్తవడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల నుంచి ఓదెల నుంచి నాంసానిపల్లెకు కంకరతేలి కనీసం నడిచేందుకు వీలులేని పరిస్థితి ఉండేది. ఈ విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తారురోడ్డు వేయించారు. దీంతో ఓదెల మల్లికార్జునస్వామి దర్శనానికి వచ్చే భక్తులు సైతం సులువుగా గమ్యం చేరుతున్నారు. ఓదెలకు ఆర్టీసీబస్సులు నడపాలంటే గతంలో రోడ్డు సౌకర్యం సరిగా లేక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం గోదావరిఖని, కరీంనగర్, హుజురాబాద్ డిపోలకు చెందిన బస్సులు గుడివరకు నడిపిస్తుండడంతో మండల ప్రజల ఇబ్బందులు తొలిగాయి.

'ఎమ్మెల్యే దాసరిపై నిరాధార ఆరోపణలు'

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గ చరిత్రను తిరగరాస్తూ వరుసగా రెండోసారి ఎన్నికైన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం కౌన్సిలర్లు కొలిపాక శ్రీనివాస్, భిక్షపతి, చంద్రశేఖర్, ఫహీంలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే నిరంతరం నియోజకవర్గ అభివృద్ధికి, అర్హులైన వారికి పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాలన్న తపనతో పని చేస్తున్నారని తెలిపారు. ఆయన హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని తేలడంతో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎలువాక రాజయ్య నిరాధార ఆరోపణలు చేశారని మండిపడ్డారు. ఇకముందు ఇలా చేస్తే ఊరుకోబోమన్నారు. ఆధారాలు చూపిస్తే వాటికి సమాధానాలిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నాయకులు మొబిన్, శ్రీధర్, పైడ రవి, తబ్రేజ్, రవీందర్, వాసు, ఎరుకల రమేశ్, హబీబ్, కల్యాణ్, శ్రీకాంత్, దేవరాజ్ తదితరులున్నారు.

నేత్రదాత కుటుంబానికి అభినందన


జ్ఞాపిక అందిస్తున్న సదాశయ ఫౌండేషన్ సభ్యులు

ఓదెల: గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేత్రదాత ఇండ్ల బుచ్చిమల్లవ్వ కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మాచారి ఆధ్వర్యంలో జ్ఞాపికను సోమవారం అందించి సమావేశంలో మాట్లాడారు. అవయవ దానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రధానకార్యదర్శ లింగమూర్తి డాక్టర్ వెంకటేశ్వర్లు, సారంగం, ప్రసాద్, సంతోష్, వెంకటేశ్వర్లు, డాక్టర్ వేణు పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలుకు వేలం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీ యోగానంద లక్ష్మినర్సింహస్వామీ ఆలయ భూమిని దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సూజాత, ఈవో డి.సదయ్య సమక్షంలో సోమవారం ఆలయం ఆవరణలో వేలం వేశారు. పెద్దాపూర్ శివారులోని సర్వే నంబర్ 1316లో 1–35 గుంటలు, సర్వేనంబర్ 1319 లో1–14 గుంటల భూమిని ఏడాది కాలానికి పంటల సాగుకు రూ.53వేలకు ఇదే గ్రామానికి చెందిన మెంగు మల్లేశంకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ జితేందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

కమాన్‌పూర్: మండలంలోని నాగారం గ్రామం పరిధిలోని లింగాలలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను జెడ్పీ చైర్మన్ పుట్టమధు సోమవారం ప్రారంభించారు. లింగాల చెరువు సమీపంలోని ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాల కోసం కేటాయించగా యువకులు ఏర్పాటు చేసుకున్న క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇటవేన కొమురమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, ఉప సర్పంచ్ మాడిశెట్టి శంకరయ్య, నాయకులు ఇనగంటి రామారావు, మేకల సంపత్, నడిగొట్టు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'గోపా'ను బలోపేతం చేద్దాం

పెద్దపల్లిరూరల్: జిల్లా గోపా సభ్యులంతా సంఘం బలోపేతానికి కృషిచేయాల ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పెద్దపల్లిలో సోమవారం గోపా నాయకులు సమావేశమయ్యారు. జిల్లాలోని మండలాల వారీగా అడ్‌హక్ కమిటీలను ఖరారు చేయాలన్నారు. నాయకులు వెంకటేశం, రాజనరేందర్, సత్యనారాయణ, జగదీశ్వర్, కిషోర్, రాజమౌళి, సతీశ్, సమ్మయ్య తదితరులున్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు ఆహ్వానం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లి గ్రామంలో ఇళ్ల స్థలాలకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ అనుపమ రావు తెలిపారు. ఇళ్లస్థలాలు లేనివారు ఈ నెల 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు జీపీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అర్హత గల లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


అప్పన్నపేటలో బీరన్నకు బోనాలతో మొక్కులు సమర్పించేందుకు ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఘనంగా బీరన్న కల్యాణం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలోని బీరన్న ఆలయం వద్ద గొల్ల, కుర్మలు సోమవారం బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కోలాహలంగా మారింది.

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట గ్రామంలో కుర్మ, యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరన్న పట్నాలు ఉత్సవాల్లో భాగంగా సోమవారం బీరన్న లగ్న బోనాలను కుర్మ, యాదవ సంఘం నుంచి 130 కుటుంబాలు ఇంటికో బోనంతో ఒగ్గు, బీర్ల పూజారుల డప్పు, చప్పుళ్ల విన్యాసాలతో మహిళలు నెత్తిన బోనాలతో బీరన్న ఆలయానికి తరలివెళ్లారు. ఒగ్గు, బీర్ల పూజారులు బీరన్న, కామరవతి కల్యాణం లగ్నపట్నం వేసి వైభవంగా నిర్వహించారు. మహిళలు బీరన్నకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

బీజేపీ నాయకుల ప్రత్యేక పూజలు

బీరన్న లగ్నపట్నానికి బీజేపీ నాయకులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, ఏగోలపు సదయ్యగౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఏగోలపు సదయ్యగౌడ్ బీరన్న ఆలయానికి మైక్‌సెట్ వితరణగా అందించారు. ఉత్సవకమిటీ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు.

గన్నీ సంచుల కొరతతో నిలిచిన కొనుగోళ్లు


కేంద్రంలో తూకం వేసిన బస్తాలు

ధర్మారం: మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీసంచులు, లారీల కొరతతో సోమవారం ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. వారం రోజులుగా గన్నీసంచులు, లారీల కొరత పేరుతో ఒక్కపూటనే కొ నుగోళ్లు చేయగా ప్రస్తుతం పూర్తిగా కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు వర్షాకాలం ముంచుకొస్తుండగా కేంద్రాల్లోనే రెండు నెలలుగా ఉంటున్నామని ఇలాగైతే తిరిగి సాగుచేయడం ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కొనుగోళ్ల ప్రారంభంలో తరుగుపేరుతో క్వింటాల్‌కు 3 కిలోలు అదనంగా తూకం వేయగా రోజులు గడిచిన కొద్ది తరుగు పేరుతో అదనంగా 5కిలోలు తూకం వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైస్‌మిల్లర్లు, అధికారులు తరుగుపేరుతో దోపిడీ చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు తమబాధలను అర్థం చేసుకుని త్వరగా తూకం చేయించాలని రైతులు కోరుతున్నారు.

గీత కార్మికుల నుంచి దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సుల్తానాబాద్: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన గీత కార్మికుల ఇన్సూరెన్స్ పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సుల్తానాబాద్ ఎక్సైజ్ సీఐ ఆనందరావు తెలిపారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంతో పాటు మండలం, ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల నుంచి పలు గ్రామాల గీత కార్మిక సొసైటీ నాయకులు గీత కార్మికుల గుర్తింపుకార్డుతో పాటు గీత కార్మికుడి ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్లు జతచేసి ఇవ్వాలని కోరారు. ఈ అవకాశాన్ని గీత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది సర్పంచ్ రమేశ్ గౌడ్, రాజుగౌడ్, పోచమల్లు, ఎల్లయ్య గౌడ్ ఉన్నారు.

ఫెస్టిసైడ్స్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


తనిఖీ చేస్తున్న అధికారులు

జ్యోతినగర్: రామగుండం మండలంలోని పలు ఫెస్టిసైడ్స్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి రోడ్డులోని ఫెస్టిసైడ్స్(ఎరువులదుకాణం)లో టాస్క్‌ఫోర్స్ బృందం ఇన్‌స్పెక్టర్ కృష్ణ, వ్యవసాయ అధికారి ప్రకాశ్ తనిఖీ చేశారు. ఎరువుల దుకాణం లైసెన్స్‌తో పాటు స్టాక్ రిజిష్టర్, బిల్‌బుక్స్ పరిశీలించారు. జై హనుమాన్ ఫర్టిలైజర్స్, సాయిరామ ఫర్టిలైజర్స్, సుగుణ ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీచేశారు. నకిలీ విత్తనాలను కానీ, పురుగుల మందులు కానీ విక్రయించరాదని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయిజ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం


పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న ప్రదేశం

జ్యోతినగర్: రామగుండం నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగం అస్తవ్యస్తంగా మారిందని, పట్టించుకునే వారు లేక సమస్యలు విపరితంగా పెరిగాయని సీపీఎం నాయకులు రామాచారి, లక్ష్మారెడ్డి ఆరోపించారు. సోమవారం కార్పొరేషన్ మూడో డివిజన్ అంబేడ్కర్ భవనం లైన్‌లోని ఖాళీస్థలంలో పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలు తిరుగుతున్నాయని, పందులు నివాసాలు ఏర్పర్చుకున్నాయన్నారు. దీంతో ప్రజలు భయాందళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. డ్రెయినేజీ సౌకర్యం లేక బురద నీరు ఖాళీ స్థలాల్లో చేరి గుంతలుగా మారి పందులకు ఆవాసాలుగా మారాయన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామన్నారు.

బాధితులకు న్యాయంచేసే వరకూ పోరాటం


బాధితులతో దాసరి ఉష

ఎలిగేడు: మండలంలోని శివపల్లిలో ఇళ్ల స్థలాలు 125 గజాల కంటే ఎక్కువగా ఉన్నవారికి జీవో 59 ప్రకారం ప్రభుత్వానికి రుసుం చెల్లించాలని ప్రభుత్వం నోటీసులు పంపించింది. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష సోమవారం శివపల్లిలోని బాధితులను కలిసి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఆర్డీవోతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ... గుంటకి రూ.రెండు, మూడు లక్షలు రుసుం చెల్లించాలని నోటీసులు పంపించారని ఇంత పెద్దమొత్తం పేదలకు ఎలా సాధ్యమవుతుందన్నారు. వారి భూమిని లాక్కుంటామని అధికారులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. బాధితుల ఇళ్లస్థలాలపై ప్రభుత్వం,అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టిన బీఎస్పీ ఆధ్వర్యంలో వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మొలుమూరి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్‌పటేల్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ.రియాజ్,నాయకులు తోట మధు, కొల్లూరి నర్సయ్య, క్యాదాసి రమేశ్, చంద్రశేఖర్, తాండ్ర అంజయ్య బాధితులు పాల్గొన్నారు.